క్లుప్తంగా

12వేల పశువులకు గాలికుంటు టీకాలు

బల్లికురవ: మండలంలోని 21 గ్రామ పంచాయతీలు 14 శివారు గ్రామాల్లో 12వేల పశువులకు గాలికుంటు వ్యాధి సోకకుండా ముందస్తుగా టీకాలు వేసినట్లు మండల పశువైద్యాధికారి పి. మహేశ్వరరావు శనివారం తెలిపారు. 4 పశు వైద్యశాలల పరిధిలోని గేదెలు, ఆవులు, ఎద్లను 4 టీమ్‌లతో సెప్టెంబర్ 15 నుంచి టీకాలు వేసే కార్యక్రమాన్ని ఉచితంగా చేపట్టి పూర్తి చేసినట్లు వైద్యాధికారి వివరించారు.

23 నుంచి ఆంజనేయ స్వామి మాలధారణ

అద్దంకి: జిల్లాలోనే ప్రముఖ పుణ్యక్షేత్రమైన శింగరకొండ ప్రసన్నాంజనేయ స్వామి దేవస్థానంలో ఈ నెల 23 నుంచి మండల దీక్ష మాలధారణ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు ఆలయ ఏసీ తిమ్మనాయుడు శనివారం తెలిపారు. దానిలో భాగంగా మండల దీక్ష ఇచ్చిన తరువాత వచ్చే నెల 12న అర్ధ మండల దీక్ష ఇస్తామని తెలిపారు. దీక్ష పూర్తి అయ్యే రోజు, హనుమద్వ్రతం రోజున వ్రత కార్యక్రమం, దీక్ష విరమణ, మన్యు సూక్త హోమం, నిర్వహిస్తామని తెలిపారు.

ఐక్యతతో ధర్మాన్ని కాపాడండి



బల్లికురవలో మాట్లాడుతున్న ఆర్‌ఎస్‌ఎస్ బాధ్యులు

బల్లికురవ: గ్రామాల్లోని ప్రజలంతా ఒకరికొకరు ఐక్యతతో హిందూ ధర్మాన్ని కాపాడాలని ఆర్‌ఎస్‌ఎస్ అద్దంకి డివిజన్ బాధ్యులు గరికపాటి వెంకట సుబ్బారావు, లక్ష్మణ్ తెలిపారు. శనివారం రాత్రి బల్లికురవలోని పోలేరమ్మ ఆలయంలో విజయదశమి ఉత్సవాల్లో భాగంగా ప్రజలతో మాట్లాడారు. అందరి దేశం ఎంతో పుణ్యభూమి,ని ఎన్నో జీవనదులకు పుట్టినిల్లన్నారు. సనాతన ధర్మాన్ని రక్షించుకోవటంతోపాటు మన దేశానికి ప్రమాదం సంభవించినప్పుడు పోరాటాలకు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు.

ఘనంగా అంతర్జాతీయ బాలికా దినోత్సవం



వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

యద్దనపూడి: మండల కేంద్రమైన యద్దనపూడి అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలలో శనివారం అంతర్జాతీయ బాలికల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలతో పాటు ఆటలపోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ రాజ్యలక్ష్మి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ బాలికల అభ్యున్నతికి పాటుపడాలని, వారి హక్కులను రక్షించేలా కృషి చేయాలన్నారు. బాలికలపై జరుగుతున్న అత్యాచారాలను, అనర్థాలను నివారించి వారి హక్కులను తెలియజేసేందుకు ఐక్యరాజ్య సమితి అక్టోబర్ 11న అంతర్జాతీయ బాలికా దినోత్సవాన్ని ప్రకటించిందని పేర్కొన్నారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సీహెచ్ సుజాత, ఉపాధ్యాయులు ఎం. పూర్ణభవాని, శ్యామలాగౌరి, సీహెచ్ ప్రభావతి, తదితరులు పాల్గొన్నారు.

వ్యాసరచన విజేతలకు బహుమతులు



విద్యార్థులకు సర్టిఫికెట్, నగదు అందజేస్తున్న ఎంఈవో, ఉపాధ్యాయులు

అద్దంకి రూరల్: అద్దంకి గ్రంథాలయ సాధన సమితి ఆధ్వర్యంలో ఈనెల 5వ తేదీన ఆధునిక గ్రంథాలయాల ఆవశ్యకతపై విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన వారికి శనివారం స్థానిక ప్రకాశం బాలికల ఉన్నత పాఠశాలలో బహుమతులు అందజేశారు. ఈ పోటీల్లో శంకవరప్పాడు జెడ్పీహెచ్ స్కూల్‌కు చెందిన తమ్మిశెట్టి భువనేశ్వరీకి ప్రథమ బహుమతి, అద్దంకిలోని సెయింట్ జోషఫ్ హై స్కూల్‌కు చెందిన మద్దులూరి కావ్యకు ద్వితీయ బహుమతి, చక్రాయపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన మిడిదొడ్డి సుభాష్‌కు తృతీయ బహుమతి లభించింది. రూ. 5వేలు, రూ. 4, రూ. 3వేల చొప్పున అద్దంకి మున్సిపల్ కమిషనర్ రవింద్ర అందించారు. గ్రంథాలయ సాధన సమితి తరఫున రఫీ రూ.500 కన్సోలేషన్ బహుమతులు అందజేశారు. ఉల్లాస్ ట్రస్ట్ తరుపున ఒక్కొక్క పాఠశాల నుంచి 10 మంది విద్యార్థుల చొప్పున 90 మందికి రూ. 90 వేల చెక్‌తోపాటు సర్టిఫికెట్‌ను అందజేశారు. కార్యక్రమంలో ఎంఈఓ కేవీ శ్రీనివాసరావు, ఉల్లాస్ ట్రస్ట్ రాము, రవిశంకర్, ధనుంజయ పాల్గొన్నారు.



అనుమల్లిపేటలో రోడ్లు పై కట్టి వేసిన పశువులు



దేశాయిపేట పంచాయతీ అనుమల్లిపేటలో నివాస గృహాల మధ్య పశువుల పాకలు

పర్యావరణం కాలుష్యమయం

- నివాస గృహాల మధ్య, సిమెంట్ రోడ్లపైనే పశువుల నివాసం
- గ్రామాల్లో ఎక్కడ చూసినా పేడ, చెత్త దిబ్బలే..
- ప్రజలను వేధిస్తున్న దోమల బెడద
- దోమల నియంత్రణ చర్యలు శూన్యం
- పెరిగిపోతున్న డెంగీ కేసులు



వేటపాలెం, దేశాయిపేట సరిహద్దులో రోడ్డు పక్కన పేరుకు పోయిన చెత్త దిబ్బ

వేటపాలెం: వర్షాకాలంలో సీజన్ వ్యాధులు కలవరపెడుతున్నాయి. ఇటీవల పందిళ్లపల్లి, రామన్నపేట, వేటపాలెం గ్రామాల్లో 8 వరకు డెంగీ కేసులు బయట పడ్డాయి. ఈగలు, దోమల స్వైరవిహారంతో ప్రజలకు కంటి మీద కునుకు లేకుండా పోతోంది. వేటపాలెం, దేశాయిపేట, రామన్నపేట, పందిళ్లపల్లి, పంచాయతీ పరిధిలో ప్రజలు వ్యాధులబారిన పడి వైద్యశాలలకు పరుగుపెడుతున్నారు. డ్రైనేజీల్లో మురుగు నీరు పేరుకు పోవడంతో దోమలు అవాసాలుగా మార్చుకున్నాయి. వేటపాలెం– దేశాయిపేట పంచాయతీలు కలిసి ఉంటాయి. అయితే రెండు గ్రామాలు సరిహద్దు రోడ్డులో వర్షం నీరు, చెత్త దిబ్బలు పేరుకు పోయి దుర్గంధం వెదజల్లుతోంది. వర్షం పడితే మరింత అధ్వానం. ఇరువైపులా నివాసం ఉంటున్న ప్రజలు ముక్కు మూసుకుని కాలం వెళ్లదీయాల్సి వస్తోంది. దేశాయిపేట పంచాయతీ అణుమల్లిపేట, వేటపాలెం, నాయినపల్లి గ్రామాల పరిధిలో పశువులను నివాస గృహాల మధ్య, సిమెంట్ రోడ్లపై కట్టి వేస్తున్నారు. అవి మల మూత్రాలు విసర్జిస్తూ పర్యావరణాన్ని పాడు చేస్తున్నాయి.

దోమల బెడద ఎక్కువైంది

వర్షాకాలం ఈగలు, దోమలు బెడద ఎక్కువైంది. పశువులను నివాస గృహాల మధ్య, రోడ్డుపై కట్టేస్తున్నారు. వాటి పేడ, మూత్రానికి తోడు వర్షం పడితే ఆయా ప్రాంతాలు రొచ్చుమయంగా మారి దుర్వాసన వెదజల్లుతున్నాయి. రాత్రి, పగలు నిద్ర ఉండటం లేదు.

– బొడ్డు సుబ్బారావు, వైఎస్సార్ సీపీ మండల మాజీ అధ్యక్షుడు

ఉపాధ్యాయులకు ఘన సత్కారం



స్వర్ణలో రిటైర్డ్ ఉపాధ్యాయులను సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

కారంచేడు: రిటైర్డ్ ఉపాధ్యాయులతో పాటు, నేటి గురువులను స్వర్ణ టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సత్కరించారు. శనివారం అందరినీ స్వర్ణ గ్రామంలోని ఆర్యవైశ్య కల్యాణ మండపంలో ఆహ్వానించారు. కార్యక్రమానికి అదే గ్రామానికి చెందిన కారంచేడు ఎంఈఓ మొలబంటి వెంకటేశ్వర్లు, పర్చూరు ఎంఈఓ పి. వెంకటరామయ్య, ప్రధానోపాధ్యాయులు టి. ప్రభాజీ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. పేద విద్యార్థులకు విద్యను చేరువ చేయడమే కాకుండా గ్రామా అభివృద్ధికి తీసుకోవల్సిన అనేక విషయాలపై చర్చించారు. స్వచ్ఛ గ్రామం కోసం తమ వంతుగా గ్రామంలో చెత్తను సేకరించే రెండు బండ్లను ఉచితంగా అందించాలని తీర్మానించారు. దీని కోసం రూ. 50 వేలను కేటాయించారు. గ్రామంలో సుమారు 8500 జనాభా ఉంటే వీరిలో సుమారు 100 మందికి పైగా ఉపాధ్యాయ వృత్తిలో ఉండటం సంతోషమన్నారు. వీరిలో 40 మందికి పైగా విశ్రాంత ఉపాధ్యాయులు తమ సలహాలు ఇవ్వాలని కోరారు.


కోటి సంతకాల సేకరణ పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

చీరాల: ప్రభుత్వం ప్రతిపాదించిన పీపీపీ విధానాన్ని వ్యతిరేకిస్తూ మాజీ ముఖ్యమంత్రి వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహనరెడ్డి పిలుపు మేరకు వైఎస్సార్ సీపీ చీరాల నియోజక వర్గ ఇన్‌చార్జ్ కరణం వెంకటేష్ సూచనల మేరకు కోటి సంతకాల సేకరణ పోస్టర్ ఆవిష్కరణ శనివారం స్థానిక చీరాల పట్టణ వైఎస్సార్ సీపీ కార్యాలయంలో పట్టణ అధ్యక్షుడు యాతం మేరీబాబు ఆధ్వర్యంలో నిర్వహించారు. రానున్న రోజుల్లో ముమ్ముందుకు తీసుకెళ్ళి ప్రజలకు అవసరమైన విద్యను, ఆస్పత్రులను దూరం చేస్తున్న విధానాన్ని ప్రజల్లోకి తీసుకెళ్ళి ప్రతి ఒక్క కార్యకర్త, వైఎస్సార్‌సీపీ నాయకులు అందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ బొనిగల జైసన్ బాబు,మున్సిపల్ కౌన్సిలర్ బత్తుల అనిల్, చీమకుర్తి బాలకృష్ణ, కంప అరుణ్, పార్టీ జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు గవిని శ్రీనివాసరావు, ఎస్సీసెల్ అధ్యక్షుడు వాసుమల్ల వాసు, యువజన విభాగం అధ్యక్షుడు కోడూరి ప్రసాద రెడ్డి, బీసీ సెల్ సభ్యులు గోలిగిరి, మహిళా నాయకురాలు ప్రసన్న, చిరంజీవి, రాజు వెంకటేశ్వరరెడ్డి, సాధు రాఘవరావు, బొడ్డు సుబ్బారావు, రమణారెడ్డి, జంగా మహేష్, రాజ్‌కుమార్, చెల్లి బాబురావు, కొండ్రు పూర్ణ, కంచర్ల చిట్టిబాబు, వెంకట రాజా, టి. వినయ్, జంగా ప్రేమ్, నాల్కోట్ రెడ్డి పాల్గొన్నారు.

పాపం.. రాజుబంగారుపాలెం



కుక్కలవారిపాలెంలో రోడ్డుపై నీరు నిలిచిన వీధి



అస్తవ్యస్తంగా ఉన్న రోడ్డు

చినగంజాం: రాజుబంగారుపాలెంలో ప్రజలు అంతర్గత రోడ్లు అస్తవ్యస్తంగా ఉండటంతో అవస్థలు పడుతున్నారు. రోడ్లన్నీ గుంతలమయమై తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. కాస్తంత వర్షం కురిస్తే చాలు రోడ్లపై వర్షపు నీరు నిలిచి నడవాలంటే కష్టంగా మారింది. అందునా డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో వర్షపు నీరు పోయే మార్గం లేక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రామ పంచాయతీ పరిధిలోని ప్రధాన రోడ్డు మార్గం సౌకర్యవంతంగా ఉన్నప్పటికీ ఇతర గ్రామాలైన కుక్కల వారిపాలెం, రాజుబంగారుపాలెం, దిబ్బలమీద పాలెం వంటి ప్రాంతాల్లో సీసీ రోడ్ల వంటి మెరుగైన రోడ్లు లేక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. స్థానిక అధికారులు, ప్రజా ప్రతినిధులు రోడ్లు, డ్రైనేజీల గురించి పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. గ్రామంలో డ్రైనేజీ వ్యవస్థ లేకున్నా ముందు గ్రామాలల్లో రోడ్ల పరిస్థితిపై చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు. ఉపాధి హామీ పథకం కింద మండలంలో రోడ్లు, డ్రైనేజీల అభివృద్ధికి సుమారు రూ. 16 కోట్లు మంజూరయ్యాయని వాటిలో కొంత మేర నిధులను రాజుబంగారుపాలెం పంచాయతీలోని రోడ్లు, డ్రైనేజీల అభివృద్ధికి కేటాయించి స్థానిక ప్రజల అసౌకర్యాలను తొలగించాలని కోరుతున్నారు.

ప్రయాణికులు అప్రమత్తంగా ఉండాలి

ఇంకొల్లు(చినగంజాం): ప్రయాణికులు అప్రమత్తంగా ఉండి తమ వస్తువులను జాగ్రత్త చేసుకోవాలని ఎస్‌ఐ సురేష్ తెలియజేశారు. శనివారం సాయంత్రం స్థానిక ఇంకొల్లు బస్టాండ్‌ను పరిశీలించారు. ప్రయాణికులు తమ వస్తువుల పట్ల జాగ్రత్తగా ఉండి వెంట తీసుకెళ్ళాలని బస్టాండ్‌లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామని తెలియజేశారు. బస్టాండు ఆవరణలో ఎవరైనా అనుమానాస్పదంగా కన్పించినా ఇంకొల్లు పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందజేయాలని సూచించారు. భవిష్యత్‌ను గురించి మంచి నడవడికతో ముందుకు సాగాలని సూచించారు.

సౌకర్యాలు కల్పించండి

చీరాల: సముద్ర తీరానికి వచ్చే పర్యాటకులకు తీరంలో అన్ని రకాల సౌకర్యాలను ఏర్పాటు చేయాలని కలెక్టర్ వి.వినోద్‌కుమార్ అన్నారు. శనివారం వేటపాలెం మండలం రామాపురం సముద్రతీరాన్ని ఆయన పరిశీలించారు. కలెక్టర్ వెంట ఆర్డీఓ చంద్రశేఖర్ నాయుడు, వేటపాలెం తహశీల్దార్ గీతవాణి, అధికారులు పాల్గొన్నారు.

నిర్మాణాలు వద్దు

చీరాల: గడియార స్తంభం సెంటర్‌లోని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహం ప్రదేశంలో ఎటువంటి నిర్మాణాలు చేపట్టవద్దంటూ కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లు శనివారం మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందించారు. వైఎస్సార్ విగ్రహానికి గడియార స్తంభం సెంటర్‌లో గతంలో ప్రభుత్వ అనుమతితో, మున్సిపల్ నిధులతో చీరాల్లో ఏర్పాటు చేశామన్నారు. విగ్రహ ప్రాంగణంలో ఎటువంటి నిర్మాణాలు చేయవద్దని వారు కోరారు. పార్టీ కౌన్సిలర్లు దాసరి శ్రీనివాసులు, పాపిశెట్టి సురేష్, షేక్ సాహిదా, జి.సలోమి, జి.ప్రశాంతిలు తెలిపారు.

వర్షాలకు నీట మునిగిన వరి

బల్లికురవ: అల్పపీడనం, వరుస తుఫాన్‌లతో 15 రోజులుగా మండలంలో ఎడతెరపి లేకుండా వర్షాలు కురుస్తున్నాయి. వర్షాల ప్రభావానికి వేసిన వరి నాట్లు నీటి మునకలో కుళ్లిపోతున్నాయని రైతులు తెలిపారు. పత్తి, మిర్చి, కంది, జూట్ పైర్లలో కూడా వర్షాల ప్రభావానికి కలుపు విపరీతంగా పెరుగుతుందని నీటి మునిగిన వరి పొలాలను ఎలా రక్షించుకోవాలో అంతుచిక్కటం లేదని రైతులు వాపోతున్నారు.



కొండాయపాలెంలో నీటిలో వరిపైరు

ఈపురుపాలెంలో శునకాలు హల్‌చల్



ఈపురుపాలెం పద్మనాభునిపేటలో గుంపులుగా సంచరిస్తున్న శునకాలు

చీరాల టౌన్: మండలంలోని ఈపురుపాలెంలో శునకాలు హల్‌చల్ చేస్తున్నాయి. గ్రామంలోని ప్రధాన వీధులతో పాటు అంతర్గత రహదారుల్లో సైతం శునకాలు గుంపులుగా సంచరిస్తున్నాయి. గ్రామంలోని పద్మనాభునిపేట, నలబై ఇండ్ల కాలనీ, పురుగుల పేట, గాంధీపార్కు సెంటర్, పాత మునుసుబుగారి వీధి, మార్కెట్ సెంటర్, రైల్వేస్టేషన్ రోడ్డు, సావరపాలెం రోడ్డు తదితర ప్రాంతాల్లో శునకాలు గుంపులుగా సంచరిస్తూ ప్రజలను కరుస్తున్నాయి. వారంరోజుల్లో నలుగురు వ్యక్తులను ఈ కుక్కలు కరిచాయి. అలానే ద్విచక్ర వాహనాలను వెంబడిస్తూ ప్రమాదాలకు కారణం అవుతున్నాయి. గుంపులుగా రోడ్ల వెంట సంచరిస్తున్న ప్రజలపై శునకాలు దాడులకు పాల్పడుతుండటంతో గ్రామస్తులు భయాందోళనలు చెందుతున్నారు. అధికారులు అలసత్వాన్ని వీడి గ్రామంలో తిరుగుతున్న శునకాలను ఊరి నుంచి పంపించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

సాగుకు భరోసా 'ధనధాన్య కృషి యోజన'



రైతులను ఉద్దేశించి మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ శాఖ అధికారి సుబ్రహ్మణ్యేశ్వరరావు

జె.పంగులూరు: మండల పరిధిలోని చందలూరు గ్రామంలో శనివారం ప్రధాన మంత్రి చేతుల మీదుగా ప్రారంభం అయిన ధనధాన్య కృషి యోజన పథకానికి సంబంధించిన లైవ్ ప్రోగ్రాంకు హాజరయ్యారు. చందలూరు మహాలక్ష్మి కల్యాణ మండపంలో మార్టూరు, అద్దంకి, పర్చూరు, పంగులూరు మండలానికి సంబంధించిన వ్యవసాయ శాఖ అధికారులు, సహాయ వ్యవసాయ సంచాలకులు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు. సమావేశంలో ధనధాన్య కృషి యోజన పథకం ముఖ్య ఉద్దేశం, రైతులను సంక్షేమానికి, వ్యవసాయ సమృద్ధికి, దేశ ఆహార భద్రతకు భరోసాగా నిలుస్తుందని తెలిపారు. రాబోవు రోజులు ఈ పథకం నిమిత్తం కేంద్ర ప్రభుత్వం భారీగా నిధులు వెచ్చించనున్నట్లు తెలిపారు. పంటలు వైవిధ్యం సాధించటానికి, నిల్వలు, ప్రాసెసింగ్ సదుపాయాలు పెంచడానికి ఈ పథకం ద్వారా అవకాశం ఉందని తెలిపారు. జిల్లా వ్యవసాయ శాఖ అధికారి సుబ్రహ్మణేశ్వరరావు, ప్రకృతి వ్యవసాయ విభాగానికి సంబంధించి కృష్ణమోహన్, డివిజన్ పశువైద్యాధికారి, చందలూరు గ్రామ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వారం రోజులుగా రాకపోకలు బంద్



కొణిదెన రోడ్డులో కూరుకున్న బస్సు

బల్లికురవ: గోతులతో కొణిదెన రోడ్డులో వారం రోజులుగా రాకపోకలు స్తంభించాయి. బల్లికురవ నుంచి కొణిదెన మీదుగా మార్టూరు వెళ్లే ఆర్‌అండ్‌బీ రోడ్డు గ్రానైట్ భారీ వాహనా రాకపోకలతో మోకాటి లోతు గోతులు ఏర్పడ్డాయి. గత సోమవారం అద్దంకి డిపో నుంచి బల్లికురవ కొణిదెన మీదుగా చిలకలూరిపేట వెళ్లే పల్లె వెలుగు బస్సు నడిరోడ్డుపై కూరుకుపోయింది. ఆ సమయంలో 6 గంటల పాటు ట్రాఫిక్ జామ్ అయింది. బస్సు డ్రైవరే క్రేన్ తెప్పించి రూ. 2 వేలు ఖర్చుతో రోడ్డుపై కూరుకున్న బస్సును బయటకు తీయించాడు. ఆ రోజు నుంచి ఆ మార్గంలో నడిచే ఈ బస్సును ఆర్టీసీ అధికారులు రద్దుతో ప్రత్యామ్నాయంగా నాగరాజు పల్లి మీదుగా నడుపుతున్నారు. 10 గ్రామాల ప్రజలు మండల నియోజకవర్గ కేంద్రం చిలకలూరిపేట, జిల్లా కేంద్రం వెళ్లాలంటే ఈ రూట్లో నడిచే ఈ బస్సే ఆధారం స్త్రీ శక్తి పేరిట ఉచిత ప్రయాణం కల్పించి బస్సు లేకుండా చేశారని అధికారులు ప్రజాప్రతినిధులు చొరవతో గోతులను పూడ్పించి కొణిదెన రోడ్డు నుంచి బస్సును పునరుద్ధరించాలని వామన చోదకులు ప్రజలు వేడుకుంటున్నారు.

వృద్ధులను గౌరవించడం బాధ్యత



వృద్ధులకు నిత్యావసర కిట్‌లు అందిస్తున్న సంస్థ ప్రతినిధులు

వేటపాలెం: వృద్ధులను గౌరవించడం బాధ్యతగా స్వీకరించాలని చీరాలకు చెందిన మానవతా సేవ సంస్థ అధ్యక్షుడు పి. నాగవిరభద్రాచారి పేర్కొన్నారు. దేశాయపేట పంచాయతీ నీలకంఠాపురంలో గల అనాథ వృద్ధ శరణాలయంలో అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించు కొని వానవత సంస్థ చే వృద్ధులకు నిత్యావసర వస్తువులు, పండ్లు, స్వీట్లు, అన్నదానం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ చైర్మన్ బండారుపల్లి హేమంతకుమార్ మాట్లాడుతూ సమాజంలో నేడు వృద్ధులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారని వారిని గౌరవించి ఆదుకోవడం మానవతా ధర్మమన్నారు. అబ్బు రమేష్, కె. ప్రసాద్, కట్టా వినయ్‌కుమార్, అనావృద్ధ శరణాలయం శాశ్వత కన్వీనర్ సత్రం మల్లేశ్వరరావు, గుత్తి విశ్వేశరరావు, ఎస్. యల్లమందారెడ్డి, హరిహరరావు, హరిహరప్రసాద్ పాల్గొన్నారు.

ఇంకొల్లులో వర్ష బీభత్సం

ఇంకొల్లు(చినగంజాం): ఇంకొల్లు మండల పరిధిలో శుక్రవారం రాత్రి 3 గంటల పాటు వర్షం బీభత్సం సృష్టించింది. ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురవడంతో ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారు. ఇంకొల్లు మండల పరిధిలో శుక్రవారం రాత్రి 43.2 మి.మీ వర్షపాతం నమోదైనట్లు డీటీ లక్ష్మీకుమారి తెలిపారు. మండలంలోని గొల్లపాలెంలో పిడుగు పాటుకు త్రీ ఫేజ్ ట్రాన్స్‌ఫార్మర్ షార్ట్ సర్క్యూట్ కావడం, ట్రాన్స్‌ఫార్మర్ దెబ్బతిన్నట్లు విద్యుత్‌శాఖాధికారి జాగర్లమూడి రామకృష్ణ తెలిపారు. గొల్లపాలెం, బీమవరం గ్రామాల్లో కూడా విద్యుత్ తీగల తెగిపోవడంతో రాత్రి 12 గంటల వరకు మరమ్మతులు చేసి నివాస కుటుంబాలకు తిరిగి విద్యుత్ సరఫరా చేశామని తెలిపారు.